'గ్రూప్-1 పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలి'

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్-1 పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ పటేల్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1, 2, 3, 4 పరీక్షల నిర్వహణలో అవినీతి అక్రమాలు జరిగాయని గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ ప్రస్తుతం అధికారం చేపట్టిన తర్వాత పరీక్షల నిర్వహణలో విఫలమైందన్నారు. గ్రూప్-1 రద్దు చేసి తిరిగి పరీక్షలు నిర్వహించాలని లేకుంటే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు.

వార్షికోత్సవానికి రండి

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్‌కాలనీ బంగారుమైసమ్మ ఆలయ 9వ వార్షికోత్సవానికి హాజరు కావాలని ఆలయ చైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో పలువురు ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు ఆహ్వానపత్రికను అందజేశా రు. ఈ నెల 23న అమ్మవారి కల్యాణోత్సవంలో పాల్గొనాలని కోరగా, ఎమ్మెల్యే సుముఖత వ్యక్తం చేశారు. ఆలయ ప్రతినిధులు డాక్టర్ సంజీవరెడ్డి, జగదీశ్వర్, శ్రీకాంత్‌రెడ్డి, శైలేందర్ పాల్గొన్నారు.

శంకేశ్వర్ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

సనత్‌నగర్: అమీర్‌పేటలోని గురుగోవింద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో జైన్ సంఘం ఆధ్వర్యంలో శ్రీశంకేశ్వర్ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. టీపీసీసీ కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జైన్ మత గురువులు ఆశీర్వచనాలు అందించారు.

యాక్సిడెంట్స్.. స్కిట్స్

సనత్‌నగర్: పౌరాణిక వేషాధారణలతో నిస్సాన్ ఎక్స్‌ప్రెస్ సంస్థ ప్రతినిధులు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగిస్తూ వాహనదారులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఆ సంస్థ ప్రతినిధులు సుధాకర్ యమధర్మరాజుగా, అనిల్ చిత్రగుప్తుడి వేషాధారణలో గ్రీన్‌ల్యాండ్స్ కూడలిలో పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్, ఎస్ఐ భూమేశ్వర్, టీటీఐ సిబ్బంది కృష్ణ, అయన్, రాజేష్, నిస్సాన్ ఎక్స్‌ప్రెస్ సంస్థ ఏజీఎం సుధీర్‌నాయర్, ఉపాధ్యక్షులు కమిలి అలీ, హెచ్ఆర్ ప్రియాంక తదితరులు స్కిట్ల రూపంలో అనర్థాలను వివరించారు. ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్ తదితర ఉల్లంఘనల వల్ల జరిగే ప్రమాదాలతో ప్రాణాలు కోల్పోవడమే కాకుండా ఎదురుగా వచ్చే అమాయకుల ప్రాణాలు కూడా పోతాయని వివరించారు. అన్ని నిబంధనలు పాటిస్తూ హెల్మెట్లు, కార్లలో సీటు బెల్టులు పెట్టుకుని ప్రయాణించే వారికి కీచైన్లను బహుమతులుగా అందజేశారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే ఎదుర్కొనే కేసులు, జరిమానాల గురించి వాహనదారులకు వివరించారు.

'రన్ ఫర్ జీసస్' ర్యాలీ

లాలాపేట: ఈస్టర్ వేడుకల్లో భాగంగా తార్నాకలోని సౌత్ లాలాగూడ సెంటినరీ బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రన్ ఫర్ జీసస్ ర్యాలీని బాప్టిస్టు చర్చి ప్రెసిడెంట్ ఎం. క్రిస్టోఫర్ జెండా ఊపి ప్రారంభించారు. తార్నాక, లాలాపేట, శాంతినగర్ మీదుగా మల్కాజిగిరి వరకు ర్యాలీ కొనసాగింది. బాప్టిస్టు సంఘం ఉపాధ్యక్షుడు బైరపాక ప్రవీణ్ కుమార్ , సెక్రటరీ వరకుమార్, జాయింట్ సెక్రటరీ డి. శ్యామ్‌సన్, కోశాధికారి, ఎం గౌతమ్‌కుమార్, పాస్టర్లు రెవరెండ్ పిజే ప్రకాశం, రెవరెండ్ ఎం. విద్యాసాగర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా

కంటోన్మెంట్: బకాయిలు చెల్లించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్‌లోని ఈడీ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2017 పే స్కేల్ బకాయిలు, 2022 నుంచి ఇవ్వాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, డీఏ బకాయిలు సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు కిశోర్ కుమార్, పీసీ మౌళి, రమణయ్య, బీఎల్ రెడ్డి, దుర్గయ్య పాల్గొన్నారు.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

సనత్‌నగర్: మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో నర్తనశాల డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గస్థానిక సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో శనివారం సద్గురు శ్రీ త్యాగరాజస్వామి 177వ ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మరువాడ నాగలలిత కామేశ్వరి శిష్య బృందంచే త్యాగరాజ కీర్తనల ఆలాపన, ప్రముఖ సంగీత విద్వాంసురాలు కొలచన వెంకటలక్ష్మీదేవిచే సంగీత కచేరి వీనులవిందుగా సాగింది. మోడల్‌కాలనీ ప్రధాన కార్యదర్శి జేఏస్‌టీ శాయి, ఉపాధ్యక్షుడు బుచ్చిబాబు తదితరులు ఆరాధనోత్సవ ఏర్పాట్లు చేశారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 33, బజ్జీమిర్చి 28, క్యాప్సికం 40, పచ్చకాకర 32, పందిరి బీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 18, దొండ 18, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

ఆస్తి పన్ను చెల్లించండహో!

'ఎర్లీ బర్డ్'కు మిగిలిన గడువు 10 రోజులే

- విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న బేగంపేట్ సర్కిల్ అధికారులు
- ముందస్తుగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ
- సద్వినియోగం చేసుకోవాలని సూచన



ఆస్తి పన్ను వసూలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

సనత్‌నగర్: 2024–25 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో ఆస్తి పన్ను వసూళ్లు చేసిన జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ అధికారులు నూతన ఆర్థిక సంవత్సరంలోనూ అదే ఉత్సాహంతో ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. ఆస్తి పన్ను చెల్లింపుదారులకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను 'ఎర్లీబర్డ్' స్కీం కింద రిబేట్‌ను అందించి ఆస్తి పన్ను వసూళ్లకు శ్రీకారం చుట్టారు. ఈనెల 1న ప్రారంభమైన ఈ స్కీం ఈ నెలాఖరుతో ముగియనున్నది. 30లోగా ఆస్తి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తున్నారు. అయితే ఇంకా 10 రోజుల గడువు మాత్రమే ఉండడంతో గృహ, వాణిజ్య సముదాయాల యజమానుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించడంతో పాటు రోజువారీ లక్ష్యాలను ఏర్పరచుకుని ముందుకు సాగుతున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ. 100 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా, రూ.99.25 కోట్లు వసూలు చేసి బేగంపేట సర్కిల్ చరిత్రలోనే రికార్డు సృష్టించారు. ప్రధానంగా మొండి బకాయిదారులపై దృష్టి సారించి పలు రూపాల్లో కొరఢా ఝుళిపించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు. ఇదే స్ఫూర్తితో ఈ ఆర్థిక సంవత్సరంలోనూ తమ రికార్డును తామే బ్రేక్ చేసే లక్ష్యంగా ముందుకుసాగాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎర్లీబర్డ్ స్కీంను సద్వినియోగం చేసుకుంటే 5 శాతం రాయితీతో ఆస్తి పన్ను చెల్లించవచ్చని బిల్ కలెక్టర్లు, సిబ్బంది చెల్లింపుదారులకు అవగాహన కల్పిస్తూ ఆస్తి పన్ను చెల్లించేలా చేయడంలో తమవంతూ కృషి చేస్తున్నారు. బేగంపేట సర్కిల్ పరిధిలో బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట, మోండా డివిజన్లు ఉన్నాయి.

బేగంపేట సర్కిల్‌లో ఆస్తి పన్ను చెల్లించే భవన వివరాలు	
మున్సిపల్ డివిజన్ -	4
కాలనీలు -	130
నివాస గృహాలు -	47,335
వాణిజ్య భవనాలు -	23,575
నివాస, వాణిజ్య - కలిపి ఉన్నవి	1,147

ఎర్లీబర్డ్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలి..



ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపుదారుల కోసం ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలోనూ ఎర్లీబర్డ్ స్కీంను తీసుకువచ్చి 5 శాతం రాయితీని కల్పించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పాత బకాయిదారులకు ఈ స్కీం వర్తించదు. కేవలం ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నుకు మాత్రమే ఈ స్కీం వర్తిస్తుంది. ఈనెల 30 లోగా ముందస్తు ఆస్తి పన్ను చెల్లించి రాయితీ అవకాశాన్ని పొందాలి. ఏవైనా అనుమానాలు ఉంటే సర్కిల్ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

– దాకూనాయక్, ఉప కమిషనర్, బేగంపేట సర్కిల్

ఆలయ అభివృద్ధికి పాటుపడండి

రాంగోపాల్‌పేట్: ధర్మకర్తలు ఆలయ అభివృద్ధికి, భక్తులకు సౌకర్యాలు మెరుగు పరిచేందుకు పాటుపడాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ కోరారు. గత నెలలో నూతనంగా ఏర్పాటైన ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో రెజిమెంటల్‌బజార్‌లోని పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయంలో సుదర్శన హోమం, రాధా రుక్మిణి సహిత పాండురంగ స్వామికి అభిషేకాలు ప్రత్యేక పూజలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆయనకు ధర్మకర్తల మండలి సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నూతన ధర్మకర్తల మండలి చైర్మన్ అల్లాడి గౌరిశంకర్, సభ్యులు నందికంటి రవి, కే శ్రీనివాస్, కే వీరేశ్, పరమేశ్వరి, ఎక్స్ అఫీసియో సభ్యులు రాజగోపాలచారిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబురావు ముదిరాజ్, సంతోష్ యాదవ్, జ్యోతి, నందికంటి నాగమణి, అర్వింద్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు



చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీ కమ్యూనిటీ హాల్‌లో ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారి స్వప్న మాట్లాడుతూ.. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. క్రమం తప్పకుండా మెడిటేషన్, యోగా చేయడంతో నార్మల్ డెలివరీకి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రసవించిన గంటలోపే తల్లిపాలు శిశువుకు పట్టించాలని సూచించారు. అనంతరం సుమారు 50 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఐసీడీఎస్ ప్రతినిధులు దీపిక, వాణి, లక్ష్మి, జాహ్నవితో పాటు అంగన్‌వాడీ టీచర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషణ్ పక్వాడ్'

అడ్డగుట్ట: అడ్డగుట్ట–3 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం 'పోషణ్ పక్వాడ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వాహకురాలు రేణుక గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. క్రమం తప్పకుండా ప్రతిరోజు స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి భోజనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింత మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రేణుక

తార్నాక డివిజన్‌లో ..

లాలాపేట: తార్నాక డివిజన్‌లోని ఆర్యనగర్, శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం 'పోషణ్ పక్వాడ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు చౌకగా దొరికే ఆహార పదార్థాలను పోషక విలువలు ఉండేలా తయారు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న బాలామృతం, పాలు, గుడ్లు, ఇతర ఆహార పదార్థాలను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు చంద్రమణి, బాలమణి, సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాలో సిబ్బంది పాత్ర కీలకం



మాట్లాడుతున్న సీఎండీ ముషార్రఫ్ ఫారూఖీ

రసూల్‌పురా: వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడంలో ఆపరేషన్, మెయింటనెన్స్, ఆర్టిజన్ సిబ్బంది కీలకపాత్ర పోసిస్తూ సంస్థకు వెన్నెముకగా నిలుస్తున్నారని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషార్రఫ్ ఫారూఖీ పేర్కొన్నారు. కంటోన్మెంట్ కేజేఆర్ గార్డెన్‌లో శనివారం సికింద్రాబాద్, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ సిబ్బంది ఇంటరాక్షన్ సమావేశంలో ఆయన పాల్గొని సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవిలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో డిమాండ్ భారీగా పెరిగే సూచనలు ఉన్నాయని గరిష్ట డిమాండ్ 5 వేల మెగావాట్లను మించే అవకాశం ఉందన్నారు. డిమాండ్ ఎంత పెరిగినా సరఫరాలో సమస్యల్లేకుండా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉందన్నారు. అత్యవసర సమయాల్లో సీఎండీ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ వరకు క్షేత్రస్థాయి సిబ్బంది ఫీల్డ్‌లో ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్లు డా. నరసింహులు, నందకుమార్, సాయిబాబా, చీఫ్ ఇంజినీర్ చక్రపాణి, సూపరింటెండింగ్ ఇంజినీర్లు గోపయ్య. వెంకన్న, డివిజనల్ ఇంజినీర్లు సిబ్బంది పాల్గొన్నారు.

మూలం సంతకు విశేష స్పందన

లాలాపేట: గ్రామభారతి, సీఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ మూలం సంతను తార్నాకలోని మర్రి కృష్ణాహాల్లో శనివారం నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల నుంచి చేతివృత్తుల వారు, రైతులు దాదాపు 80కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇందులో పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యాన్ని పరిరక్షించే వ్యవసాయ, గోఆధారిత వస్తువులను విక్రయానికి అందుబాటులో ఉంచారు. తార్నాక పరిసర ప్రాంతాల నుంచి వినియోగదారులు పెద్ద సంఖ్యలో సంతను సందర్శించారు. 20 వన మూలికలతో తయారు చేసిన దవా చాయ్‌ని ఉచితంగా అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కృష్ణారెడ్డి, మల్లేశం, గ్రామభారతి అధ్యక్షురాలు సూర్యకళ, ప్రధాన కార్యదర్శి మోహన్ తదితరులు ఉన్నారు.



దండోరా నేతల త్యాగాల ఫలితమే వర్గీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: దండోరా నేతల త్యాగాల వల్లే ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల కల సాకరమయ్యిందని మాదిగ దండోరా ఉద్యమకారుల వేదిక చైర్మన్ డా.రుద్రవరం లింగస్వామి మాదిగ పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్గీకరణకు రెండు ప్రభుత్వాలు జీవో నంబర్.19, జీవో 33 జారీ చేసి అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణలో ఓయూ విద్యార్థులు, అధ్యాపకుల పాత్ర కీలకమని ఉద్యమానికి మొదటి నుంచి వెన్నుదన్నుగా నిలచిన ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.కాశీం, చీఫ్ వార్డెన్ డా.కొర్రెముల శ్రీనివాస్ రావుకు శనివారం ఆయన స్వీట్లు తినిపించి కృతజ్ఞతలు తెలిపారు.

కార్ఖానలో 'జైబాపు, జైభీమ్, జై సంవిధాన్'



కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేశ్

రసూల్‌పురా: బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్ఖానలో 'జైబాపు, జైభీమ్, జై సంవిధాన్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్ పాల్గొని మహంకాళి ఆలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు జమీల్, ముప్పిడి గోపాల్, మహేశ్, అష్రఫ్, వివేక్, శ్రీనివాస్, రమేశ్, ఇటుక గోపి, నరేశ్ ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓయూలో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలోని నలుగురి విద్యార్థులకు అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయి. సునందకు అమెజాన్ కంపెనీలో ఏడాదికి రూ.45 లక్షల ప్యాకేజీ, జుస్‌పే కంపెనీలో ఐరాజ్ ఫాతిమాకు రూ.27 లక్షలు, మహ్మద్ ఆరిఫ్‌కు దిషో కంపెనీలో మహ్మద్ అరీఫ్, ఎస్ఏ నదీమ్‌కు రూ.24.85 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు వచ్చాయని అధికారులు తెలిపారు. దీంతో వారిని వీసీ ప్రొ.కుమార్ అభినందించారు.

నిరవధిక సమ్మె షురూ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కాంట్రాక్టు అధ్యాపకులు నిరధిక సమ్మె శనివారం ప్రారంభమైంది. క్యాంపస్‌లోని పాలన భవనం ఎదుట టెంట్‌కు అనుమతి ఇవ్వకపోవడంతో ప్రవేశ ద్వారం వద్ద అధ్యాపకులు బైఠాయించి మొదటి రోజు సమ్మె చేశారు. రాష్ట్రంలోని 12 వర్సిటీల్లో బడ్జెట్, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు బోధిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని ఆందోళనలు చేపట్టిన ప్రభుత్వం స్పందించకపోవడంతోనే తరగతులు బహిష్కరించి సమ్మెకు దిగినట్లు అధ్యాపకులు తెలిపారు. ఓయూ క్యాంపస్ కాలేజీతో పాటు నిజాం, సికింద్రాబాద్, సైఫాబాద్, జిల్లా పీజీ కాలేజీలు, వీర నారి చాకలి ఐల్లమ్మ మహిళా వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు సమ్మెలో కూర్చున్నారు. కార్యక్రమంలో డా.ఉపేందర్, డా.సీమర్ల విజేందర్ రెడ్డి, డా.పరశురాం, డా.వేల్పుల కుమార్, డా.తాళ్లపల్లి వెంకటేశ్, డా.పాండేయ్య, డా.రేష్మారెడ్డి, డా.వినత పాండే, డా.కృష్ణయ్య, డా.హెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉటుకూరు మణిదీప్‌కు అరుదైన గౌరవం

లవకుశ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకం



సనత్‌నగర్: మణిదీప్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా యూత్ కన్వీనర్, ఉటుకూరి మణిదీప్‌కు అరుదైన గౌరవం దక్కింది. అయోధ్య రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధీనంలోని లవకుశ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ (పుత్ర అయోధ్య)కు తెలంగాణ రాష్ట్ర ప్రతినిధిగా ఆయన నియమితులయ్యారు. బేగంపేట కుందన్‌బాగ్ అపార్ట్‌మెంట్స్‌కు చెందిన మణిదీప్ సామాజిక సేవకుడిగానే కాకుండా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో పాటు ఆధ్యాత్మిక క్షేత్రాల నిర్మాణాల్లో భాగస్వామిగా నిలుస్తూ వస్తున్నారు. తన ట్రస్ట్ తరఫున దాదాపు 180 మంది నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం, అలాగే ఉన్నత విద్యనభ్యసించే 30 మంది వరకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. పలు సంస్థలతో కలిసి రక్తదాన శిబిరాల నిర్వహణ, తదితర ఆయన చేసిన సేవలకు గాను ఇటీవల హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతల మీదుగా ప్రతిభా పురస్కారం కూడా అందుకున్నారు. తెలంగాణలో లవకుశ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తరఫున చేపట్టే ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆయనే ముందుకు తీసుకెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఆయన తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన శ్రీశ్రీశ్రీ మహంత్ నిత్య గోపాల్‌దాస్‌జీ మహరాజ్, శ్రీశ్రీ కమల్‌నయన్‌దాస్‌జీ మహరాజ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న 'అనంతోత్సవం'

సనత్‌నగర్: సనత్‌నగర్‌లోని వైభవం బంకెట్ హాల్‌లో అనంత లా కాలేజ్ ఆధ్వర్యంలో 'అనంతోత్సవం' పేరిట శనివారం నిర్వహించిన వేడుకలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ఫ్రెషర్స్‌కు స్వాగతం పలకడంతో పాటు సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు పలికారు. రిటైర్డ్ డీజీపీ అరుణ బహుగుణ హాజరై మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యత ఉందని, అలాంటి రంగంలో అడుగుపెట్టిన విద్యార్థులు న్యాయం కోసమే పోరాడినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. అలాగే నిరుపేదలకు న్యాయ సహాయం చేసేందుకు ప్రయత్నించాలన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ డీజీపీ అరుణ బహుగుణ

అంతకుముందు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ఎంవీ చంద్రామతి, కరస్పాండెంట్ రవి అనంత తదితరులు పాల్గొన్నారు.

తార్నాకలో జలమండలి అధికారుల తనిఖీ



లాలాపేట: తార్నాక జలమండలి ఆధ్వర్యంలో తార్నాకలోని పలు కాలనీల్లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినగర్, గోకుల్‌నగర్, నాగార్జున నగర్ కాలనీలో పలు ఇండ్లలో నల్లాలకు అక్రమంగా మోటార్లు బిగించగా వాటిని సీజ్ చేయడంతో పాటు రూ 5 వేల జరిమానా విధించినట్లు తార్నాక జలమండలి మేనేజర్ మహమ్మద్ ఆసిఫ్ అలీ తెలిపారు. మోటారు సీజ్ అయిన ఇంటి యజమాని నోటీసు అందుకున్న వారం రోజుల్లో జరిమానా చెల్లించాలని లేకుంటే సివరేజ్ లైన్ డిస్ కనెక్ట్ చేస్తామని హెచ్చరించారు. వేసవిలో ప్రజలందరూ సమానంగా తాగునీటిని పొందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో జలమండలి సిబ్బంది పాపారావు, అశోక్ తదితరులు ఉన్నారు.

అలరించిన 'ఫేర్‌వెల్ డే'



చిలకలగూడ: చిలకలగూడ ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన ఫేర్‌వెల్ డే అలరించింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రైమరీ నుంచి హైస్కూల్‌కు వెళ్తున్న ఐదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన డ్యాన్సులు, నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల హెచ్ఎం మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయులు అయేషాఅంజూమ్, మల్లీశ్వరీ, హసినాబేగం, సాలెహే, హసీన్‌సుల్తానా, పుష్పలత, శిరీషా, రోజా, దివ్య పాల్గొన్నారు.

కులగణన ఎక్స్-రే లాంటిది మాత్రమే

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన ఎక్స్-రే లాంటిదని కానీ మనకు ఎంఆర్ఐ స్కానింగ్ కావాలని రాజకీయ తత్త్వవేత్త ప్రొ. యోగేంద్ర యాదవ్ అన్నారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగం సెమినార్ హాల్‌లో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ నేత మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం కుల గణన రిజర్వేషన్లు, సామాజిక న్యాయం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఐఏఎస్ చిరంజీవులు, ఢిల్లీ వర్సిటీ ప్రొ.సుకుమార్, డా.పరందాములు తదితరులు హాజరై బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఐక్యత తదితర అంశాలపై ప్రసంగించారు.

బోయిన్‌పల్లి పీఎస్‌కు యూత్ కాంగ్రెస్ నేతల తరలింపు

కంటోన్మెంట్: శాంతియుతంగా నిరసనలు చేస్తున్న యూత్ కాంగ్రెస్ నేతలను అరెస్టు చేయడం అన్యాయమని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చేర్చడాన్ని నిరసిస్తూ ధర్నా చేస్తున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, ఇతర నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని బోయిన్‌పల్లి స్టేషన్‌కు తరలించారు. వారిని ఎమ్మెల్యే శ్రీగణేశ్ పరామర్శించారు.

కారు పార్కింగ్ విషయంలో గొడవ

చిలకలగూడ: కారు పార్కింగ్ విషయంలో జరిగిన గొడవలో వైద్యుడు గాయపడిన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన పవన్‌కుమార్‌శర్మ (29) కర్నాటకలో ఎంబీబీఎస్, ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పంలో ఎండీ పూర్తి చేశాడు. డాక్టర్ ఆఫ్ మెడిసిన్ (డీఎం) ప్రిపరేషన్ కోసం పద్మారావునగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ రీడింగ్‌రూమ్‌లో చదువుకుంటున్నాడు. ఈనెల 18న సాయంత్రం 4 గంటలకు తన కారును పార్కింగ్ చేసేందుకు గాంధీ ఆస్పత్రి ఎదుట డీసీఎం అడ్డా వద్దకు వచ్చాడు. ఇక్కడ కేవలం డీసీఎం వాహనాలే పార్కింగ్ చేయాలని చెప్పడంతో వాగ్వాదం జరిగింది. అదే సమయంలో 8 మంది అక్కడికి వచ్చి పవన్‌కుమార్‌శర్మపై దాడి చేసి గాయపర్చారు. ఈమేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ముషీరాబాద్ డీసీఎం అడ్డా వద్ద కొంతమందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపారు.

గంజాయి మత్తులో యువకుల హల్‌చల్

చిలకలగూడ: చిలకలగూడ ఠాణా పరిధిలోని మెట్టుగూడలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కొంతమంది యువకులు గంజాయి మత్తులో హల్‌చల్ చేసి ఓ యువకుడిపై దాడికి పాల్పడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్టుగూడకు చెందిన కొంతమంది యువకులు, మద్యం, గంజాయికి బానిసయ్యారు. రాత్రి సమయాల్లో అటుగా వచ్చినవారిపై అకారణంగా దాడులకు పాల్పడి విలువైన వస్తువులు తీసుకుంటున్నారు. శుక్రవారం రాత్రి దాడికి పాల్పడగా, బాధితుడు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు మరింత ముమ్మరంగా గస్తీ నిర్వహించి ఆకతాయిలు, రౌడీమూకల నుంచి రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. శుక్రవారం రాత్రి జరిగిన దాడి ఘటన తమ దృష్టికి వచ్చిందని, అయితే ఫిర్యాదు అందలేదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని చిలకలగూడ పోలీసులు తెలిపారు.

వ్యభిచార ముఠా గుట్టురట్టు

రాంగోపాల్‌పేట: వ్యభిచార ముఠా వ్యవహారాన్ని రాంగోపాల్‌పేట పోలీసులు రట్టు చేసి ఇద్దరు విటులను అరెస్ట్ చేసి, పరారీలో ఉన్న నిర్వాహకుల కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఉద్యోగాల కోసం నగరానికి వచ్చిన అమాయక యువతులను లక్ష్యంగా చేసుకుని మాయమాటలు చెప్పి వ్యభిచార కూపంలోకి దింపి డబ్బులు సంపాదిస్తున్నట్లు గుర్తించారు. రాంగోపాల్‌పేట ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు తెలిపిన వివరాల మేరకు.. రాంగోపాల్‌పేట పీజీరోడ్డు, బాపూబాగ్ కాలనీలోని ఓ భవనం రెండో అంతస్తులో సెక్స్ వర్కర్లతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈనెల 18న పథకం ప్రకారం దాడి చేసి ఇద్దరు విటులతో పాటు ఇద్దరు యువతులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కొన్ని రోజుల క్రితం పశ్చిమబెంగాల్ రాష్ట్రం నుంచి ఉద్యోగాన్వేషణ కోసం నగరానికి వచ్చినట్లు సదరు యువతులు తెలిపారు. ఉద్యోగ్య ప్రయత్నంలో ఉండగా స్వప్న అనే యువతి పరిచయం అయిందని, చేతన్ అనే వ్యక్తితో కలిసి ఈ భవనంలో ఉంటున్నామని వివరించారు. పట్టుబడిన విటులు నగరానికి చెందిన మహ్మయద్ అవియాజ్ (32), ఫహద్ హుస్సేన్ (25)పై కేసులు నమోదు చేశారు. యువతులను షెల్టర్‌హోంకు తరలించారు. వ్యభిచార గృహ నిర్వాహకులు స్వప్న, చేతన్ కోసం గాలిస్తున్నామన్నారు. నిర్వాహకురాలు స్వప్న వాట్సాప్, ఫోన్ నంబర్ల ద్వారా విటులను ఆకర్షించి వ్యభిచార గృహానికి రప్పిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.